ఫైసా ఫైసా కూడబెట్టి కొన్నారు..





అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న మహిళలు..



నిన్న సక్రమం.. నేడు అక్రమం!

దేవేందర్‌నగర్‌లోని సర్వే నం.307 ఎస్‌ఎఫ్‌సీ, 342, 329 ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన నిర్మాణాలను మంగళవారం అధికారులు కూల్చివేశారు. భారీ బందోబస్తు నడుమ తెల్లవారుజామున ఇళ్లను కూల్చడం ప్రారంభించారు. ఏం జరుగుతుందో అని తెలుసుకునే లోపే కొన్ని ఇళ్లను నేలమట్టం చేసేశారు. ఇంటి నుంచి బయటకి పరుగు పెడుతూ ఇళ్లు కూల్చొద్దంటూ అధికారుల కాళ్లు పట్టుకున్నా కనికరం చూపలేదు. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా ఎదురు తిరిగిన ప్రతి ఒక్కరిని పోలీసులు లాక్కెళ్లారు. వారి ఇళ్లను కూల్చేస్తుంటే మహిళలు, పిల్లలు విలపించిన తీరు కలచివేసింది. పైసా పైసా కూడబెట్టి కట్టుకున్న ఇళ్లను కూల్చుతుంటే ఆ పేదలు తట్టుకోలేకపోయారు. ఇళ్లు కట్టుకునేటప్పుడు రాని అధికారులు ఇప్పుడు రాబందుల్లా తమ ఇళ్లపై పడ్డారని గుండెలు అదిరేలా విలపించారు.

– కుత్బుల్లాపూర్

అక్రమ నిర్మాణాలని కూల్చారు.!



జేసీబీలు ముందుకు వెళ్లకుండా అడ్డుగా కూర్చున్న బాధితులు







తమ ఇంటిని కూల్చివేయడంతో విచారం వ్యక్తం చేస్తున్న మహిళ..

క్లుప్తంగా

నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి



జగద్గిరిగుట్ట: జాతీయ డెంగీ డే సందర్భంగా జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది మంగళవారం డివిజన్ పరిధిలోని పలు బస్తీలలో దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంటమాలజీ సిబ్బందితో పాటు ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు జైహింద్ పాల్గొని డెంగీ వ్యాధులు రాకుండా ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎంటమాలజీ సూపర్‌వైజర్ మల్లేష్, సిబ్బందితో పాటు సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని ఎన్‌సీఎల్ నార్త్ కాలనీలోని సాయిబాబా ఆలయ 22వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం విశేష పూజలు జరిగాయి. చివరి రోజు మంటప పూజలు, శ్రీరుద్ర హోమం, అష్టోత్తర కలశాభిషేకం, నవగ్రహ హోమాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్న హారతి అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఐడీపీఎల్ స్క్రాప్ టెండర్‌ను రద్దు చేయాలి

- టీఎస్‌టీఎస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు

కూకట్‌పల్లి: ఐడీపీఎల్ స్క్రాప్ టెండర్‌ను రద్దు చేయడంతో పాటు, శాశ్వత నివాసయోగ్యం కేంద్ర ప్రభుత్వం కల్పించాలని టీఎస్‌టీఎస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు డిమాండ్ చేశఋరు. మంగళవారం ఐడీపీఎల్ ఉద్యోగుల నిరసన దీక్షలో ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. ఐడీపీఎల్‌లో రూ.1000 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. దీని వెనుక బీజేపీ జాతీయ నాయకుల హస్తం ఉందన్నారు. ఈ నిరసనలో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.బీజేరావు

రాయదుర్గం: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ హెల్త్ సెంటర్‌లో బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్‌ఎస్), ఫస్ట్ ఎయిడ్ ట్రెనింగ్ సెషన్‌ను మంగళవారం అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువకులు శరీర ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం అనే రెండు అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు.అందరూ బీఎల్‌ఎస్, ఫస్ట్ ఎయిడ్ ట్రెనింగ్ సెషన్‌లో అపోలో ఆస్పత్రి డాక్టర్ అహ్మద్ అలీ, డాక్టర్ యాజిత అవగాహన కల్పించడంతోపాటు పలు సూచనలు చేశారు. హెచ్‌సీయూలోని ఉద్యోగుల పిల్లల కోసం ఈ సెషన్‌ను ప్రత్యేకంగా నిర్వహించారు. వారిలో దాదాపు 40 మందికి బీఎల్‌ఎస్, ప్రథమ చికిత్స శిక్షణ అందించారు.

బస్తీల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించండి

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



ప్రగతియాత్ర చేస్తున్న ఎమ్మెల్యేపై పూలుచల్లి స్వాగతిస్తున్న బస్తీల ప్రజలు

కుత్బుల్లాపూర్: ప్రజలకు మెరుగైన పాలన అందించే దిశగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతి యాత్రలో భాగంగా మంగళవారం ఆయన గాజులరామారం డివిజన్ పరిధిలోని మెట్‌కానిగూడ, మారుతినగర్, కూన కృష్ణమహాలక్ష్మినగర్, పెద్దమ్మనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా బస్తీల వాసులు తమ ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేను సత్కరించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డీఈఈ రూపాదేవి, జలమండలి డీజీఎం అప్పల నాయుడు, ఏఈ కళ్యాణ్, మేనేజర్ రోహిణి, బీఆర్‌ఎస్ నాయకులు రషీద్ బైగ్, కస్తూరి బాల్ రాజ్, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, నవాబ్, కమలాకర్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా..

సుభాష్ నగర్ డివిజన్ భాగ్యలక్ష్మి కాలనీలో నివాసం ఉంటున్న చప్ప శ్రీనివాసరావు (43), కర్రి ఈశ్వర్‌రావు (38)లు విజయనగరం నుంచి బతుకుదెరువు కోసం వలస వచ్చి కూలీ పని చేస్తూ జీవనం సాగించేవారు. కాగా సెప్టెంబర్ 2022లో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి చెందారు. కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని కంబాపూర్ గ్రామానికి చెందిన మద్దూరి లక్ష్మి (34) అనే మహిళ బతుకుదెరువు నిమిత్తం డీఆర్‌కే కాలేజ్ సమీపంలోని డాలర్‌హిల్స్ విల్లాస్‌లో పనిచేస్తూ జూన్ 2022లో ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగిలి అక్కడికక్కడే మరణించింది. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రత్యేక చొరవ తీసుకుని విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున నష్ట పరిహారం అందించేలా ఒప్పించారు. మంజూరైన సదరు చెక్కులను మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీసీ వేమారెడ్డి, అరుణారెడ్డి తదితరులు ఉన్నారు.

కంటి వెలుగు కేంద్రం ప్రారంభం



కళ్లద్దాలు అందజేస్తున్న కార్పొరేటర్ కాసాని శిరీష

నిజాంపేట్: కంటి వెలుగుతో పేదల కళ్ల సమస్యలు తీరనున్నాయని నిజాంపేట్ కార్పొరేషన్ 21వ డివిజన్ కార్పొరేటర్ కాసాని శిరీష అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ కళ్ల పరీక్షలు చేయించుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ పేదలకు కంటి సంబంధిత సమస్యలను దూరం చేసేందుకే కంటి వెలుగును తీసుకువచ్చారన్నారు. డివిజన్ బీఆర్‌ఎస్ ప్రెసిడెంట్ జహంగీర్, జలగం చంద్రయ్య, రామ నర్సింహ, వడ్ల రాజు, లక్ష్మి, భారతి, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తాం

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయి ప్రశాంత్‌నగర్‌లో 28 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజ్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్నారు.

◆ ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తుల కృషి చేస్తామన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని తెలిపారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రాజు, లక్ష్మి, నాయకులు మాధవ్, కుమారస్వామి, వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లకు స్థలం లేదని ఇప్పుడు గుర్తొచ్చిందా?

మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పన్నాల హరీష్‌రెడ్డి, మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో కేంద్రాన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం స్థలం ఇవ్వమని అడగటం ఎమ్మెల్యే కృష్ణారావు తన ఓటమిని అంగీకరించినట్లేనని బీజేపీ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శించారు. తొమ్మిది సంవత్సరాల పాటు అధికారాన్ని అనుభవిస్తున్న కృష్ణారావు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లకు స్థలం లేదని ఎన్నికల ముందు గుర్తుకొచ్చిందా అని ప్రశ్నించారు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో 100 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని అందులో 18వేల డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించవచ్చని మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి తెలిపారు. మంగళవారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

◆ అక్రమాలన్నింటిని సక్రమాలుగా చేసే కృష్ణారావు పేదలకు డబుల్ బెడ్ ఇళ్ల విషయంలో చిత్తశుద్ధిని ప్రదర్శించటం లేదని ధ్వజమెత్తారు. గత ఎమ్మెల్యేల హయాంలో సెంటు భూమి కూడా కబ్జా కాలేదన్నారు. ఎమ్మెల్యే కృష్ణారావు హయాంలోనే వందల ఎకరాలు కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు.

ఐడీపీఎల్ కంపెనీ స్క్రాప్ అంశంలో ఆరోపణలు సరికావు..

కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు మాట్లాడుతూ... బాలానగర్‌లోని ఐడీపీఎల్ కంపెనీ స్క్రాప్ అంశంలో బీఆర్‌ఎస్ పార్టీ జర్నలిస్టు జగన్‌మోహన్‌రావు చేస్తున్న తీవ్ర ఆరోపణలను సరికాదన్నారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేసే బీఆర్‌ఎస్ పార్టీ మీడియా విభాగంలో పనిచేస్తున్న జగన్ తన తీరును మార్చుకోవాలని సూచించారు. మెటల్ స్క్రాప్ ట్రేడ్ కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ 17 అక్టోబర్ 2019న ఐడీపీఎల్ సంస్థ ఈ స్క్రాప్ అమ్మకాలకు సంబంధించిన అంశంపై చేసుకున్న అగ్రిమెంట్‌ను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

◆ దేశ వ్యాప్తంగా నలభై రెండు వివిధ రంగాల కొనుగోలుదారులను ఆహ్వానించగా 33మంది కొనుగోలుదారులు పాల్గొన్నారని తెలిపారు. కాగా మెటల్ స్క్రాప్ ట్రేడ్ కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ ముంబాయి, మహారాష్ట్రకు చెందిన వారికి క్లియరెన్స్ ఇచ్చి విషయం బహుశా జర్నలిస్టు జగన్ మర్చిపోయారని అన్నారు. కాంతారావు వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో సూర్యప్రకాష్‌రావు, శ్రీకర్‌రావు, వడ్డేపల్లి శరణ్, ప్రతాప్‌రెడ్డి, వినోద్, మనోహర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎస్‌ఈ పరీక్షలో సత్తాచాటిన ఓక్రిడ్జ్ విద్యార్థులు

దుండిగల్: ఏఐఎస్‌ఎస్‌ఈ పరీక్షలో ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. 2022–23 విద్యా సంవత్సరపు ఆల్ ఇండియా సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్ పరీక్షలో బౌరంపేటలోని ఓక్రిడ్జ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. గ్రేడ్‌–12లో 79 శాతం, గ్రేడ్‌–10లో 84 శాతం సగటు స్కోరును సాధించగా గ్రేడ్‌–12లో అనన్య జైన్ 97 శాతం, గ్రేడ్‌–10లో శ్రేయా పూరీ 98.8 శాతంతో టాప్ స్కోరర్లుగా నిలిచారు. వీరితో పాటు కనిష్క జైన్, అశ్విక్‌రెడ్డి లు 95, 98 శాతం సాధించారు. వీరిని పాఠశాల యాజమాన్యం అభినందించింది.

అది పులి కాదు.. కుక్కే!



సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యం

జీడిమెట్ల: అపురూపాకాలనీలో చిరుత పులి సంచరించిందనే పుకారు షికారు చేసింది. ఆదివారం తెల్లవారుజామున 2గంటల ప్రాంతంలో ఓ కిరాణా షాపు యజమాని తన షాపు ముందు నుంచి చిరుత పులి వెళ్లినట్లు తన సీసీ ఫుటేజీలో కనిపించినట్లు చెప్పాడు. అనంతరం సదరు విడియోలను వాట్సప్‌లో వైరల్ చేశాడు. ఇక అంతే సంగతి కాలనీ మొత్తం తమ కాలనీలోకి చిరుత పులి వచ్చిందంటూ వార్తను వైరల్ చేసేశారు. సదరు వీడియోను ఫారెస్ట్ అధికారులకు పంపించారు. వారు వీడియోను పరిశీలించి అది కుక్క అని తేల్చి చెప్పారు. చిరుత పులి అయితే దాని తోక చాలా పొడవుగా ఉంటుందని పేర్కొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు చెక్

కుత్బుల్లాపూర్: సీసీ కెమెరాలతో నేరాల కట్టడితో పాటు దొంగతనాలు తగ్గుముఖం పడతాయని పేట్‌బషీరాబాద్ సీఐ ప్రశాంత్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధి రామారాజునగర్‌లో కాలనీ వాసుల సౌజన్యంతో ఏర్పాటు చేసుకున్న 21 కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలను మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ ప్రశాంత్ మాట్లాడుతూ.. ఎన్నో కీలక కేసులు చేధించడంలో సీసీ ఫుటేజీలు కీలకంగా మారాయని అన్నారు. అందుకే ప్రతి కాలనీ, బస్తీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామరాజునగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బండరాయితో మోది ఫోన్, ద్విచక్రవాహనంతో పరార్



బాధితుడు సాయికృష్ణ

జీడిమెట్ల: అలసిపోయి నిద్రిస్తున్న వ్యక్తిపై ఓ గుర్తు తెలియని వ్యక్తి బండరాయితో కొట్టి స్మార్ట్ ఫోన్, ద్విచక్రవాహనం తీసుకుని పరారైన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం డివిజన్ సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన సాయికృష్ణ(27) ప్రైవేట్ ఉద్యోగి. ఈనెల 12న పనిపై బయటకి వెళ్లిన సాయికృష్ణ ఎండలో అలసిపోయాడు. దీంతో కాసేపు సేదతీరుదామని జీడిమెట్ల డిపో వెనుక రోడ్డులో ఉన్న హనుమాన్ గుడి వద్ద నిద్రపోయాడు. అక్కడకు వచ్చిన ఓ గుర్తు తెలియని వ్యక్తి సాయికృష్ణ తలపై బండరాయితో కొట్టి స్మార్ట్ ఫోన్, ద్విచక్రవాహనం తీసుకుని పరారయ్యాడు. సాయికృష్ణ అరుపులు విన్న కొంతమంది సాయికృష్ణను ఆస్పత్రిలో చేర్పించారు. కోలుకున్న సాయికృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భూమిపూజ

కూకట్‌పల్లి: ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న జరిగే ప్రత్యేక సంచిక, వెబ్‌సైట్ ఆవిష్కరణ కార్యక్రమానికి కైత్లాపూర్ గ్రౌండ్ వేదికయ్యింది. ఈ మేరకు మంగళవారం కమిటీ చైర్మన్ టీడీ జనార్దన్ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాచిన సుబ్బారావు, సుబ్బారావు, రాజా, ఆలం శివ, కోటి,అరూప్, అచ్యుత్, శ్రీనివాస్, గోపి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు పరుశురాముడి ప్రతిమ అందజేస్తున్న దృశ్యం

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంక్షేమ సంఘాల నేతలు ఆయనను కలిశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన రాజు ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

ఎమ్మెల్సీని కలిసిన ఆలయ కమిటీ సభ్యులు..

జగద్గిరిగుట్ట డివిజన్‌లోని శ్రీ పరుశురాం దేవాలయ ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిసి పరుశురాముడి ప్రతిమను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, నేతలు సోమేశ్ యాదవ్, రుద్ర అశోక్, గోపాల్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

◆ అదే విధంగా దుండిగల్ తాండ–2కు చెందిన కాట్రోత్ కీర్తి ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో స్టేట్ 4వ ర్యాంక్ సాధించింది. ఆమెను శంభీపూర్ రాజు ఘనంగా సన్మానించారు. కౌన్సిలర్ శంకర్ నాయక్, ఆకుల ప్రభాకర్ గుప్తా, భీమా నాయక్ ఉన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం.. క్రీడాకారులను ప్రోత్సాహం

కుత్బుల్లాపూర్: క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీలో మంగళవారం ఆయన సీఎం కప్–2023 పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీశైలంయాదవ్ మాట్లాడుతూ.. 15 – 36 సంవత్సరాల మధ్య వారికి ఆయా విభాగాల వారీగా కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, వాలీబాల్ నిర్వహిస్తున్నామని అన్నారు. మండలస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, జూనియర్ అసిస్టెంట్ రంజిత్ కుమార్, వైస్ చైర్మన్ రత్లావత్ గంగయ్య నాయక్, కౌన్సిలర్లు సువర్ణ, చింతల రవీందర్, డప్పు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ కొంపల్లిలోని అపర్ణ పామ్‌గ్రోవ్స్ సెప్టిక్ టాంక్ నుంచి దూలపల్లి కల్వర్ట్ వరకు రూ.288.15 లక్షలతో చేపట్టే ఆర్‌సీసీ పైపులైను పనులను శ్రీశైలం యాదవ్ పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

క్రీడాకారుల అభివృద్ధికి ఎంతో కృషి

దుండిగల్: తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి అన్నారు. మున్సిపాలిటీలోని డి.పోచంపల్లి క్రీడామైదానంలో 'సీఎం కప్–2023' కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ... మూడు రోజుల పాటు పలు విభాగాల్లో పోటీలు జరుగుతాయని అన్నారు. విజేతలుగా నిలిచిన వారిని జిల్లా, రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు బండారి మహేందర్ యాదవ్, సాయిబాబా యాదవ్, గోపాల్ రెడ్డి, మేనేజర్ సునంద, రెవెన్యూ అధికారి శ్రీహరి రాజు తదితరులు పాల్గొన్నారు.

బడి రూపురేఖలు మారుతున్నాయ్..

జోరుగా లెనిన్‌నగర్ ప్రాథమిక పాఠశాల పనులు



పాఠశాల అభివృద్ధి పనులు చేపట్టిన కొత్తలో ఇలా..

జగద్గిరిగుట్ట: ఒకే గదిలో 51మంది పిల్లలు ఉండే ఆ ప్రాథమిక పాఠశాలకు తల్లిదండ్రులు తమ పిల్లలని చేర్పించడానికి కూడా ఆలోచించేవారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని లెనిన్‌నగర్ ప్రాథమిక పాఠశాలను అభివృద్ధి చేయడానికి 6 నెలల క్రితం కార్నివలి ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడంతో ఆ పాఠశాల రూపురేఖలు మారనున్నాయి.

◆ రూ.56లక్షలతో గత సంవత్సరం పాఠశాలలో మూడు తరగతి గదులు, ఒక ఆఫీస్ గది, వంటశాలలోతో పాటు కనీస సౌకర్యాలు లేని వాటిపై ఎక్కువ శ్రద్ధ చూపారు. విద్యార్థిని విద్యార్థులకు అత్యాధునిక 4 మరుగుదొడ్ల నిర్మాణం, అలాగే శుద్ధి చేసే ఆర్‌ఓ ప్లాంట్ నిర్మాణం చేపట్టి తాగునీటి సౌకర్యం కల్పించడానికి పూనుకున్నారు.

◆ పాఠశాలలో పనులు మరో నెలలో పూర్తి అవుతుండడంతో చుట్టుపక్కల వాళ్ల తమ పిల్లలను చేర్పించడానికి వారి తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ఈ సంవత్సరం సుమారు 30–40 మంది విద్యార్థులు చేరవచ్చన్నారు.

◆ నియోజకవర్గంలో ఎన్నో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్న కార్నివలి ఫౌండేషన్ తమ పాఠశాలను ఎంచుకొని రూపురేఖలు మార్చి విద్యార్థులకు బోధించేందుకు అనువుగా వేర్వేరు తరగతి తదులు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని పాఠశాల హెడ్ మాస్టర్ ఇన్నారెడ్డి అన్నారు.



ప్రస్తుతం పాఠశాలలో చివరి దశకు చేరుకున్న పనులు